నగరాభివృద్ధికి కృషి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కార్మికురాలికి డ్రిల్లింగ్ మిషన్‌ను అందిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కార్పొరేషన్, మే 31: కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి కరీంనగర్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పేద ఒడ్డెర కార్మికుల కోసం ఎంపీ లాడ్స్ నిధుల నుంచి కొనుగోలు చేసిన డ్రిల్లింగ్ మిషన్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ, పేద ప్రజల ప్రయోజనాలు, అభివృద్ధి కోసమే మోదీ ప్రభుత్వం ఎంపీ లాడ్స్ నిధులను కేటాయిస్తున్నదన్నారు. గతంలో నగరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 13 ఒడ్డెర కుటుంబాలు సర్వస్వం కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. కష్టం చేసుకుని జీవనం సాగించే ఒడ్డెర కులస్తుల కోరిక మేరకు డ్రిల్లింగ్ మిషన్స్‌ను కొనుగోలు చేసి అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవకాశం ఉన్నా కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి నగరాన్ని, పార్లమెంట్ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే శాతవాహన యూనివర్సిటీలో లా క్లాసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ మేయర్లు యాదగిరి సునీల్ రావు, డి.శంకర్, మాజీ కార్పొరేటర్లు, డీఈ లచ్చిరెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్: బండి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చర్చకు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలతో పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు భారత సైనికులను కించపరిచేలా ఉన్నాయన్నారు. దేశ ఆర్మీ చీఫ్ మీద సీఎంకు విశ్వాసం లేదా? అని ప్రశ్నించారు. రాజన్న ఆలయంలో కోడెలను రక్షించాల్సిన బాధ్యత రాజన్న దేవస్థానందేనని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నాయకులు మూటలు తీసుకుపోయి ఢిల్లీ నేతలకు కప్పం కడుతున్నారని విమర్శించారు.

బహిరంగ ధూమపానం నేరం

మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్

కోర్టుచౌరస్తా, మే 31 : మైనర్‌లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం, బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్ తెలిపారు. నగరంలోని సీతారాంపురంలో జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ సొసైటీ భవనంలో శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వాడకం వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమానికి హాజరైన కార్మికులతో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, జేఏసీ అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, వివిధ సంఘాల అధ్యక్షులు నారాయణ, మీస రాజయ్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ర్యాలీ తీస్తున్న వైద్యులు

విద్యానగర్, మే 31 : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం నగరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ తన కార్యాలయ ఆవరణలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధూమపానం అనేది కేవలం ఒక అలవాటు కాదని, అది మన ఆరోగ్యాన్ని నాశనం చేసే ఒక మానసిక, శారీరక బానిసత్వమని పేర్కొన్నారు. ఇది అనేక ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. మన శరీరం దేవాలయం లాంటిదని, దాన్ని కాల్చకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో డీఐవో డాక్టర్ సాజిద, ఓడీడీటీ డాక్టర్ ఉమాశ్రీ, పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, పీవైఎన్‌సీడీ డాక్టర్ విప్లవ శ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల్, ఎన్‌హెచ్ఎం డీపీవో స్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ కైక, సూపర్‌వైజర్స్ పోచయ్య, శ్రీనివాస్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీ మాధవిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ ఏసీపీ మాధవికి మామిడి మొక్క బహూకరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ టౌన్, మే 31: హుజూరాబాద్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాధవిని హుజూరాబాద్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, మామిడి మొక్కను బహూకరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హుజూరాబాద్ టౌన్ సీఐగా మాధవి గతంలో ప్రజలకు అద్భుతమైన సేవలందించారన్నారు. ఏసీపీ హోదాలోనూ ప్రజలకు అంతకు మించి సేవలందిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు రమాదేవి, కుమారస్వామి, నాయకులు రాజేందర్, భాస్కర్, రాజు, మైకేల్ రాజేందర్, సమ్మయ్య, చింత శ్రీనివాస్, తులసి లక్ష్మణమూర్తి, రాజ్ కుమార్, శ్రీధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సిటిజన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సన్మానం

ఏసీపీ వీ మాధవిని తెలంగాణ సిటిజన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఆలేటి రవీందర్, ప్రధాన కార్యదర్శి సందేల వెంకన్న, కోశాధికారి ఆకుల సదానందం, కార్యదర్శి ఉప్పు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ

డాక్టర్ వరప్రసాదరావు పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిరుమలా దేవి

శంకరపట్నం, మే 31: పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ సాధ్యపడుతుందని మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన డాక్టర్ వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేలలో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వృక్షశాస్త్ర సీనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఆయన రాసిన పరిశోధనా గ్రంథం 'ఫ్లోరా ఆఫ్ తెలంగాణ'ను శనివారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలా దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాదరావు మాట్లాడుతూ, త్వరలో భవిష్యత్ తరాలకు సమృద్ధిగా ఆక్సిజన్ విడుదల చేసే వృక్షాలపై పరిశోధనా గ్రంథం వెలువరిస్తున్నట్లు వెల్లడించారు. వరప్రసాదరావు ఆవిష్కరణలపై మండలానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- దోమల నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్/విద్యానగర్, మే 31 : వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. నాలాలు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, దోమల నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పలు ప్రభుత్వవిభాగాల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతూ, పర్యవేక్షించాలన్నారు. నీటి నమూనాలు సేకరిస్తూ క్లోరినేషన్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అనువైన ప్రాంతాల్లో మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మునగ, జామ, బొప్పాయి, నిమ్మ లాంటి మొక్కలతో పాటు కానుగ, ఇతర పండ్ల మొక్కలు ఈసారి ఎక్కువగా నాటించేలా శ్రద్ధ చూపాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన మొక్కలు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు పోలీసు, రెవెన్యూ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.మహేశ్వర్, డీఎఫ్‌వో బాలమణితో పాటు పలు ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలి

కలెక్టరేట్, మే 31: అద్దెభవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను జూన్ 10లోగా ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని, అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్ ఆదేశించారు. నగరంలోని సుడా కార్యాలయంలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటివరకు 63 కేంద్రాలు మార్చారని, నిర్దేశించిన గడువులోగా విధిగా మార్చాల్సిందేనని, లేని పక్షంలో సంబంధితాధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భవనాల్లోకి మార్చిన అనంతరం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రెహ్మాన్, సీడీపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

గంగాధర, మే 31: మండలంలో ఈ నెల 3 నుంచి 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ శనివారం ప్రకటనలో తెలిపారు. 3న ఇస్లాంపూర్, ఆచంపల్లి, 4న కాచిరెడ్డిపల్లి, ఒద్యారం, 5న నర్సింహులపల్లి, న్యాలకొండన్నపల్లి, 6న సర్వారెడ్డిపల్లి, కురిక్యాల, 9న కొండాయపల్లి, మల్లాపూర్, 10న వెంకటాయపల్లి, గట్టుభూత్కూర్, 11న నారాయణపూర్, గట్టుభూత్కూర్, 12న నాగిరెడ్డిపూర్, గర్శకుర్తి, 13న బూరుగుపల్లి, గర్శకుర్తి, 16న గంగాధర, ఉప్పరమల్యాల, 17న ర్యాలపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే రెవెన్యూ సదస్సును వినియోగించుకుని భూసమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.

అనాలోచిత వైద్య విధానాలతో ప్రజారోగ్యానికి ముప్పు

విద్యానగర్, మే 31: కేంద్ర ప్రభుత్వం వైద్య విధానంలో అనాలోచిత మార్పులతో తెస్తున్న చట్టాలతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని, ఆ చట్టాలను తాము పూర్తిగా ఖండిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మన దేశం వైద్య రంగం ప్రపంచానికే ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని, అలాంటిది చైనాలో అవలంబించిన పథకాలు ఆ దేశాన్ని భ్రష్టు పట్టించాయని గుర్తు చేశారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్‌ను కలిపే మొదటి ఇంటిగ్రేటెడ్ కోర్సును పాండిచ్చేరిలోని ప్రముఖ సంస్థ అయిన జిప్‌మర్‌లో ప్రారంభించనున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయని, దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 779 వైద్య కళాశాలల్లో సంవత్సరానికి 1,36,325 మంది వైద్య విద్యార్థులు అందుబాటులోకి వస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం అనాలోచిత విధానాలకు స్వస్తి పలకాలని కోరారు.

బాలపురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 31 : మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి అందజేయనున్న పీఎం రాష్ట్రీయ బాలపురస్కార్-2025 అవార్డుల కోసం అర్హులైన బాల,బాలికలు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. వివిధ రంగాల్లో నైపుణ్యం, ప్రతిభ చూపిన 5-18 ఏళ్లలోపు బాలలు జూలై 31లోగా httpp//awards.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు అప్‌లోడ్ చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

సర్కారు బడిలో ప్రవేశాలకు ఏఐ ప్రచారం

తిమ్మాపూర్ రూరల్, మే 31: మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయంతో ప్రత్యేక ప్రచార వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. ఉమారాణి, ఉపాధ్యాయులు కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

తెలంగాణచౌక్, మే 31: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని డిపో-1 డీఎం విజయమాధురి తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల డిపో-1 కార్యాలయంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు చేసిన ఫిర్యాదులు. సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వీసులు పెంచాలని, విద్యాసంస్థల సమయానికనుగుణంగా బస్సులను నడిపించాలని ప్రయాణికులు చేసిన విజ్ఞప్తులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

సీసీఐ సిబ్బందికి శిక్షణ

కలెక్టరేట్, మే 31 : జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పిల్లల సంరక్షణ విధానం, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్‌లలో ఉండే పిల్లలకు కల్పించాల్సిన కనీస వసతులపై వివరించారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి మెళకువలు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్, పీవో ఎన్ఐసీ శాంత, సీసీ ఐల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలపై నిరసన

గన్నేరువరం, మే 31: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు డబ్బులు చెల్లించాలని శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు ఏడు వారాలుగా కూలి డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో జాబ్ కార్డ్‌లు డిలీట్ అవుతున్నాయని, సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కూలి డబ్బులు జమ చేయాలని, లేదంటే కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, జిల్లా నాయకులు కాంతలా అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

తిమ్మాపూర్, మే 31: తిమ్మాపూర్ గ్రామంలోని ఊర చెరువులో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన గోనె మహేశ్ (36)కు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మౌనికతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కొడుకు చరణ్, కూతురు శిరీష ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతూ ఉండడంతో తిమ్మాపూర్‌లోనే పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో గొడవలు సైతం ముదిరి కొట్లాటల వరకు వెళ్లినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం సమయంలో గ్రామస్తులకు ఊర చెరువులో గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో వెలికి తీసిన పోలీసులు గోనె మహేశ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే గొడవలు జరిగిన నేపథ్యంలో మహేశ్ అనుమానాస్పద స్థితిలో మరణించడంతో ఎవరైనా హత్య చేశారా? లేక తానే ఆత్మహత్య చేసుకున్నాడా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 31: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్, లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి 11గంటల వరకు పద్మనగర్, పద్మనగర్ పారమిత స్కూల్ ఏరియా, ఉదయం 7నుంచి 8.30గంటల వరకు కోర్టు వెనుక ప్రాంతం, మోర్ సూపర్ మార్కెట్, ఓల్డ్ డీఐజీ బిల్డింగ్, క్రిస్టియన్ కాలనీ, సవరాన్ స్ట్రీట్, శ్రీలత హాస్పిటల్ ఏరియా, చర్చి, రామ్ రాజ్ కాటన్ ప్రాంతం, ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రజ్వీ చమాన్, సిటిజన్ కాలనీ, ప్రియ దర్శిని కాలనీ, కృష్ణ నగర్, ఆటో నగర్, ధర్మ నగర్, బొమ్మకల్ గ్రామం, లక్ష్మీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

తెలంగాణచౌక్, మే 31: ఉద్యోగులు, సిబ్బంది దురలవాట్లకు దూరంగా ఉండాలని ఆర్టీసీ జోనల్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఏవీ గిరిసింహారావు సూచించారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్టీసీ జోనల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిద్ర రాకుండా ఉంటుందనేది అపోహ మాత్రమేనని తెలిపారు. నిత్యం వేల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే డ్రైవర్లు ఎలాంటి మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు వసుధ, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

గంగాధర, మే 31: రాజకీయాలకతీతంగా చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మధురానగర్‌లో గ్రామీణ ఉపాధిహామీ నిధులు రూ.2.63 కోట్లతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, డైనేజీని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడుతామని, తర్వాత గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్, మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, పంజాల ప్రశాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

వీణవంక, మే 31: వికసిత సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చల్లూరు రైతువేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాల గురించి కేవీకే శాస్త్రవేత్తలు డా.మహేశ్, జి.ప్రభాకర్ వివరించారు. కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రతినిధులు డా. కె.సునీత, డా.శివకుమార్, ఎంఏవో గణేశ్, ఏఈవో శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, మే 31: మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, ఇందుర్తి గ్రామాల్లోని రైతు వేదిక, గ్రామ పంచాయతీల్లో రైతులకు శాస్త్రవేత్తలు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గురించి శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ గజేంద్ర, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మానకొండూరు డివిజన్ ఏడీఏ శ్రీధర్, ఉద్యానవన అధికారులు మంజువాణి, మండల వ్యవసాయ అధికారి రాజుల నాయుడు, మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య

మానకొండూర్ రూరల్, మే 31: కొండపల్కల గ్రామానికి చెందిన కుక్క రమేశ్(40) సంవత్సరం నుంచి తాగుడుకు బానిసై, ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన కుక్క రమేశ్ ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. శుక్రవారం కూడా బాగా మద్యం తాగి ఇంట్లోనే ఓ రూమ్‌లో పడుకున్నాడు. శనివారం తెల్లవారుజామున ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య లత, కుమారుడు ఉన్నాడు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపారు.

కెప్టెన్‌ను కలిసిన వినోద్‌కుమార్

కెప్టెన్‌ను కలిసిన మాజీ ఎంపీ వినోద్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు

హుజూరాబాద్ రూరల్, మే 31: మాజీ ఎంపీ కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావును మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శనివారం హుజూరాబాద్ మండలం సింగాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే వీ సతీశ్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, యువ నేత ఇంద్రనీల్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు విరమించుకోవాలి

కార్పొరేషన్, మే 31: ఉపాధ్యాయులకు సంబంధించి సర్దుబాటుకు జిల్లా కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవాల నరహరి, చకినాల రాంమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, పది మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు, 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలనడం పూర్తిగా అశాస్త్రీయమని పేర్కొన్నారు. ఈ తీరు ప్రభుత్వ విద్యాలయాలను